షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్హులైన 11 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్ ఉమారాణితో కలిసి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.సంధ్యారాణి, రఘు, మధు, బి.భీమ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పారామెడికల్, ఇతర కోర్సులలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేసినట్లు యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ మక్బూల్ అహ్మద్ గురువారం వెల్లడించారు. అలైడ్ హెల్త్ సైన్సెస్‌లో ఈ సంవత్సరం నుంచి పీహెచ్‌డీ కోర్సును ప్రవేశ పెడుతున్నామన్నారు. మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ (ఎంఎల్‌టి అండ్ ఎంఐటీ) కోసం దరఖాస్తులను సమర్పించడానికి జూన్ 4 ఆఖరు అని వెల్లడించారు. పీహెచ్‌డీ అలైడ్ హెల్త్ సైన్సెస్(ఎంఎల్‌టి)లో అడ్మిషన్ కోసం దరఖాస్తులను మే 13వ తేదీ వరకు సమర్పించవచ్చన్నారు. ఉర్దూ నేపథ్యం ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23006612 ఎక్స్‌టెన్షన్ 1801లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అన్నదానం



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం వద్ద గురువారం ఉదయం అన్నదానం చేశారు. నిత్యాన్నదానంలో భాగంగా ప్రతి రోజు 500మందికి పైగా పేదల ఆకలి తీరుస్తున్నామని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు.

శ్యామలదేవి హోమం



ఎంసీహెచ్ కాలనీలో శ్యామలాదేవి హోమం నిర్వహిస్తున్న శక్తి ఆనందస్వామి

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని ఎంసీహెచ్ కాలనీలో గురువారాం శ్రీ శక్తిపీఠం ఉపాసకులు శక్తి ఆనందస్వామి ఆధ్వర్యంలో శ్యామలాదేవి అమ్మవారి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, అన్నదాన కార్యక్రమం, అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి అడుగడుగునా హారతుల్చి స్వాగతం పలికారు. ప్రతి ఏడాది శ్యామలాదేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నామని తెలిపారు.

ఎంసీఎస్‌లో సత్తా చాటిన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు తమ రాష్ట్రమైన మిజోరంలో ఉన్నతాధికారులుగా నియమితులయ్యారు. మిజోరం సివిల్ సర్వీసెస్ (ఎంసీఎస్-2024, కంబైన్డ్ కాంపిటేటివ్) పరీక్షల్లో ఇద్దరు హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు సత్తా చాటారు. మిజోరం సివిల్ సర్వీసెస్ పరీక్షలో టాప్ ర్యాంక్‌ను పూర్వ విద్యార్థి శామ్యూల్ మల్సామ్ జువాలా హెచ్‌సీయూలో ఎంఏ ఎకనామిక్స్ చదివారు. అదేవిధంగా మరో పూర్వవిద్యార్థి జెలాలామ్‌పుయా పొలిటికల్‌సైన్స్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఏ చదివారు. వీరిద్దరూ మిజోరం సివిల్ సర్వీస్‌కు కేటాయించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ ఫ్యాకల్టీలు వారిని అభినందించారు.

'ఆల్ట్ డాట్ ఎఫ్ కో వర్కింగ్ స్పేస్' ప్రారంభం

చందానగర్ : చిన్న వ్యాపారుల అవసరాలను తీర్చే వాల్యూ ఫస్ట్ డిజైన్ నేతృత్వంలో వర్క్ స్పేస్‌లను అందించడంలో ఆల్ట్ డాట్ ఎఫ్ కో వర్కింగ్ నిబద్ధత కలిగి ఉందన్నారు. గురువారం నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఆల్ట్ డాట్ ఎఫ్ కో వర్కింగ్ స్పేస్ నూతన కార్యాలయంను సహ వ్యవస్థాపకుడు యోగేష్ అరోరా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ట్ డాట్ ఎఫ్ కోవర్కింగ్ తమ విస్తరణ ప్రణాళికలో భాగంగా నూతన కేంద్రంను హైదరాబాద్‌లో ప్రారంభించామన్నారు. ఇద్దరు నుంచి 30 మంది వరకు గ్రూప్‌ల కో వర్కింగ్ స్పేస్ సీట్లను అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్‌లో రానున్న రెండు సంవత్సరాలలో హైటెక్ సిటీ, కొండాపూర్, మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తామన్నారు.

సన్నాలు సంతోషం.!

● రేషన్‌దుకాణాలకు వచ్చిన లబ్ధిదారుల్లో నవ్వు మొహం ● సర్కిల్-6 పరిధిలో సన్నబియ్యం పంపిణీ షురూ

చౌక ధరల దుకాణాలు	69
తెలుపు రేషన్ కార్డులు	58,766
అంత్యోదయ అన్నయోజన కార్డులు	1780
అన్నపూర్ణ కార్డులు	18
ఇవనున్న సన్నబియ్యం	12,09,824 కిలోలు



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం



రేషన్ దుకాణాలో నిల్వ ఉన్న సన్నబియ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పౌరసరఫరాల శాఖ సర్కిల్-6 పరిధిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మే 1 నుంచి ప్రారంభమైంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రభుత్వం తెలుపు కార్డుతో పాటు అంత్యోదయ అన్నయోజన, అన్నపూర్ణ కార్డుల ద్వారా అందరికీ దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యాన్ని పంపిణీ చేయనుంది. ఇప్పటికే సర్కిల్-6 పరిధిలోని గోదాంలోకి చేరుకోగా అక్కడి నుంచి నేరుగా రేషన్ దుకాణాదారుల నుంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

◆ **స్థానిక సంస్థలు ఎన్నికల కోడ్‌తో జాప్యం...**

రాష్ట్ర వ్యాప్తంగా గత నెలలోనే సన్నబియ్యాన్ని పంపిణీ చేయగా సర్కిల్-6 పరిధిలోని అంబర్‌పేట, ముషీరాబాద్, ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలు, బస్తీలలోని రేషన్‌దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోంది. అయితే నగరంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కొనసాగిన నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీలో జాప్యం అయ్యింది. అన్ని జిల్లాలో ఏప్రిల్ నుంచే ప్రారంభం కాగా హైదరాబాద్‌లో మాత్రం మే 1 నుంచి ప్రారంభమైంది.

◆ **పేదల్లో ఆనందం..**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీతో పేదల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. సన్నబియ్యంలో నాణ్యత ఉండటంతో బియ్యాన్ని తమ చేతులతో పరిశీలిస్తూ తమ మొహంలో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సన్న బియ్యం ఎప్పటికీ ఇస్తారా లేదా ఈ ఒక్క నెలనా అంటూ ప్రశ్నించడం గమనార్హం.

అన్ని రేషన్ దుకాణాలకు...



అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యాన్ని సరఫరా చేశాం. ఈ ప్రక్రియ పూర్తయ్యింది. తెల్ల రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం అందుతుంది. అన్నపూర్ణ కార్డు ఉన్న వారికి 10 కిలోల చొప్పున ఇస్తారు. అంత్యోదయ అన్నయోజన కార్డుకు 35 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తాం. పంపిణీలో ఎలాంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకురావాలి. – ఏఎస్‌ఓ.దీప్తి

చాలా ఆనందంగా ఉంది



సన్నబియ్యం పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉంది. మాలాంటి పేదలకు ఇదోక వరం. ప్రభుత్వం ఇలాంటి పథకాన్ని తీసుకురావడం మంచి పరిణామం. దొడ్డు బియ్యంతో అన్నం తినాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఈ సన్నబియ్యాన్ని చూస్తుంటే మాలో ఆనందం కలుగుతోంది. – భారతి, లబ్ధిదారులు

క్యూ కడుతున్నారు...



ప్రభుత్వం సన్నబియ్యం ప్రారంభించడంతో ఉదయం నుంచే లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం మంచిగానే ఉన్నాయి. ముక్కబియ్యం వాసన రావడం లేదు. ఎప్పటికీ ఇస్తారా.. లేదా కొన్ని నెలల వరకే ఇస్తారా.? అంటూ లబ్ధిదారులు అడుగుతున్నారు. –ఎల్.రాజు రేషన్‌డీలర్

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ వివేక్ వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అంబేడ్కర్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం అంబేడ్కర్ విద్యాసంస్థలో 10వ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కష్టపడేతత్వం ద్వారానే విజయానికి చేరుకుంటారని అన్నారు. ఉన్నత విద్యలో రాణించడానికి హైస్కూల్ విద్య ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. మీ భవిష్యత్.. మీ పైనే ఆధారపడి ఉందని క్రమశిక్షణతో ముందుకు సాగితే అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ సరోజ, జాయింట్ సెక్రటరీ పీవీ రమణ తదితరులు ఉన్నారు.

కులగణన నిర్ణయం.. బహుజన ఉద్యమ విజయం

బీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం.. బహుజన ఉద్యమ విజయమేనని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడాన్ని మూలవాసులు స్వాగతిస్తున్నారని అన్నారు. భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్ మెశ్రాం పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేశామన్నారు. ఏప్రిల్ 9న జైల్ భరో కార్యక్రమాన్ని కూడా నిర్వహించమని గుర్తు చేశారు. బహుజనుల చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్యను పరిష్కరిస్తాం



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాట్లు చేసిన సమావేశంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు తన వంతు చొరవ తీసుకుంటానని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గురువారం డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో కలిసి ఆస్పత్రి సమస్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఆస్పత్రిలో నీటి సమస్యలపై చర్చించారు. ఆస్పత్రిలో ఉన్న బోర్ మరమ్మతులకు గురవడంతో ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్లతో సరఫరా చేసేందుకు చొరవ తీసుకుంటానని అన్నారు. రెండు రోజుల్లో కొత్త బోర్ వేయించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దాక్షాయిని, ఇతర వైద్యులు, సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సమాజ చైతన్యం కాంక్షించే సాహిత్యం రావాలి



మాట్లాడుతున్న అరసం నగర శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌గౌడ్

గౌలిపురా: హనుమాన్‌నగర్ జ్ఞాన భారతి మోడల్ స్కూల్‌లో అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో 139వ మే డేను పురస్కరించుకొని సమాజంలో కవుల పాత్ర అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కవులు పాల్గొని తమ కవిత వినిపించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక అభ్యుదయ సామాజికవేత్త, నాంపల్లి వొకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎర్రబైరి సురేందర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సమాజ చైతన్యానికి నేడు కవులు, కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమానికి అరసం నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాశ్ అధ్యక్షతన వహించారు. గౌరవ అతిథిగా అరసం నగర శాఖ ప్రధాన కార్యదర్శి జి.చంద్రమోహన్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. సమాజ హితం కోరే కార్యక్రమాలకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అరసం నగర శాఖ కోశాధికారి, న్యాయవాది అటుకుల రాజు, సీనియర్ అరసం (ఏఐఎస్ఎఫ్) నాయకుడు ఎస్.ఆర్.శ్రీనివాస్, ఐటీయూసీ సీనియర్ నాయకుడు హెచ్.అశోక్‌తో పాటు సాహెబ్, జాద విశాల్, పున్నయ్య, సంతోష్, ప్రభాకర్, జి.మల్లేష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుట్టు శిక్షణ తరగతులు

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులను నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు పోరండ్ల శారదా ప్రభాకర్ తెలిపారు. మే 2వ తేదీ నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు సంఘం ప్రధాన కార్యదర్శి అర్చన సెల్: 8179834587లో సంప్రదించాలని సూచించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

చిక్కడపల్లి: సీఎం సహాయ నిధి పేదలకు వరమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 20మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గంలోని అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల జారీలో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్‌కుమార్, శ్యామ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, ఆకుల అరుణ్‌కుమార్, ముఠానరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మాణిక్‌రాయ్ (ఫైల్)

చిక్కడపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈ.మాణిక్‌రాయ్(50), అజామాబాద్ దాదుస్ స్వీట్‌హౌస్ గోడౌన్‌లో కొన్ని రోజుల నుంచి పని చేస్తున్నాడు. బీడీ తెచ్చుకొవడానికి వెళ్లిన మాణిక్‌రాయ్ తరిగి రాలేదు. అతని బంధువైన బన్షీ మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలసిన వారు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నం.87126 60162.

మే నెలంతా పొగాకు వ్యతిరేక అవగాహన దినోత్సవాలు

పంజగుట్ట: సాధారణ క్యాన్సర్ వచ్చే దానికన్నా పొగాకు వాడే వారికి 30 శాతం అధికంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పలువురు ప్రముఖ వైద్యులు పేర్కొన్నారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ ఓ.ఎస్.రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే నెల మొత్తం పొగాకు వ్యతిరేక అవగాహన దినోత్సవాలుగా చేస్తున్న నేపథ్యంలో పొగాకు ఉత్పత్తులవల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ ఓ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాంధీ ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ డాక్టర్ కె.టి.రావు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ వింధ్య వాసి, ఈఎండీటీ వైద్యులు డాక్టర్ చిట్టిబాబులు పాల్గొని మాట్లాడారు.

ప్రొగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకల్లో మహిళా కార్మికులు



ఘనంగా మే డే



ముషీరాబాద్ భరత్‌నగర్‌లో మేడే జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు దశరథ్

మే డే ఉత్సవాలను గురువారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకున్నాయి. ఆయా యూనియన్ల ఆధ్వర్యంలో పరిశ్రమల వద్ద జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల కోసం పోరాటాలు సాగించిన నాయకుల స్మారకార్థం మేడే ఉత్సవాలను జరుపుకుంటూ వస్తున్నామని.. వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలు నిర్వహిస్తూ మేడే వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. వీఎస్‌టీ కార్మికులకు త్వరలో కంపెనీ సిఫ్టింగ్ బెనిఫిట్స్ అమలు చేస్తామని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ సభ్యుడు, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి చెప్పారు. వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన జెండాను ఆవిష్కరించారు. మే డే సందర్భంగా అచ్చుతారెడ్డి మార్గ్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం





ముషీరాబాద్ నియోజకవర్గంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



బతుకమ్మకుంటలో మే డే వేడుకల్లో సీపీఎం అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ మహేందర్



వీఎస్‌టీ యూనియన్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న జి.సంజీవరెడ్డి



మార్క్స్ భవన్ వద్ద మేడే జెండాను ఎగరవేస్తున్న ఎస్.ఎల్.పద్మ



జవహర్‌నగర్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం నేతలు సాగర్, మల్లారెడ్డి



షాలిమార్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మేడే వేడుకల్లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ యూసుఫ్

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



సన్నబియ్యం అందజేస్తున్న ఆల్ ఇండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ సన్న బియ్యంతో కడుపునిండ భోజనం చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందజేస్తున్నారని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రావణ్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

వారినే ఆర్టీఐ కమిషనర్లుగా ఎంపిక చేయాలి

పంజగుట్ట: సమాచార కమిషనర్లను ఏ రాష్ట్రంలో అయినా స్క్రీనింగ్ కమిటీ, సెర్చ్ కమిటీ వారు సూచించిన పేర్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని, కాని తెలంగాణ రాష్ట్రంలో పార్టీలకు అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చెయ్యడం సరికాదని సమాచార హక్కు సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తిక్ రాజు అన్నారు. ఇప్పటికే పలువురిని ఎంపికచేసి వారి పేర్లతో కూడిన జాబితాను గవర్నర్ కార్యాలయానికి పంపినట్లు సమాచారం ఉందని వెంటనే ఆ జాబితాను నిలిపివేయాలని గురువారం గవర్నర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



విద్యుత్ శాఖ సిబ్బందికి ఎలక్ట్రికల్ ఆటోను అందజేస్తున్న ఏడీఈ వినోద్‌కుమార్

ముషీరాబాద్: విద్యుత్ సమస్యలు ఏర్పడితే సకాలంలో సమస్యలను పరిష్కరించి మెరుగైన విద్యుత్ సరఫరా జరిగేలా యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని ఆజామాబాద్ విద్యుత్‌శాఖ ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగా గురువారం ముషీరాబాద్, రాంనగర్ సెక్షన్లను ఎలక్ట్రికల్ ఆటోను విద్యుత్ శాఖ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులు అందిన వెంటనే ఘటన స్థలానికి వెంటనే చేరుకునేలా ఎలక్ట్రికల్ ఆటోను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈలు సునీల్‌రెడ్డి, సుదామా తదితరులు పాల్గొన్నారు.